ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణభాస్కర



## (కాకినాడలో శ్రీనాన్నగారి ప్రవచనము, 6-7-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఆధ్యాత్మికమార్గంలో ఎవరికి ఇష్టమైన మార్గంలో వారు ప్రయాణంచేయవచ్చు. ఏ గురువును, ఏఅవతార పురుషుని ఆరాధించాలంటే ఆరాధించుకోవచ్చు. కాని పొందవలసిన గమ్యం గురించి తెలియాలి. గమ్యం గురించి మనకు సరియైన అవగాహన లేకపోతే అది మూఢత్వం అన్నారు ఆచార్యులవారు. వ్యవహారిక జ్ఞానం లేకపోతే భౌతిక విషయాలలో ఇతరుల చేతమనం మోసగించబడతాము అదేవిదంగా సాదించవలసింది ఏమిటి? మన గమ్యంఏమిటి? అనే అవగాహన లేకపోతే ఈ ఆధ్యాత్మిక రంగంలో కూడా ఇతరుల చేత మోసగించబడే అవకాశంఉంది. అందుచేత విషయాన్ని బాగా శ్రవణం చేయాలి. శ్రవణంచేస్తే విషయం మీకు అర్ధంఅవుతుంది. శ్రవణంచేయకపోతే మననం చేయటానికి అవకాశంలేదు, మననం చేసి అనుభవంలోనికి తెచ్చుకోనే అవకాశం కూడాలేదు.

ప్రతీమానవుడికి సుఖం, శాంతి, ఆనందంకావాలి. అవిలేకపోతే మనకు జీవించాలి అని ఉండదు. జీవితం పట్లవిరక్తి కలుగుతుంది. మనకు శాంతి కుదిరితే వంద సంవత్సరాల జీవితం వందక్షణాలలో వెళ్ళిపోయినట్లు ఉంటుంది. అది శాంతియొక్కవైభవం. అది మన హృదయంలోనే ఉంది. నిర్వాణం అన్నా, మోక్షంఅన్నా, స్వర్గరాజ్యం అన్నా ఒక్కటే. మీలోనుండి నేను విడుదల పొందటం మోక్షంకాదు. నాలోనుండి మీరు విడుదల పొందటం మోక్షం కాదు. నా నుండి నేనే విడుదల పొందటం మోక్షం. నాకున్న అహంభావన నుండి, అజ్ఞానము నుండి విడుదల పొందాలి. మనహృదయంలో మోక్షసామ్రాజ్యం, సుఖసముద్రంఉంది. మనం ఎవరో మనకు తెలిస్తే ఆ సుఖసముద్రం పొంగి సహస్రారానికి అందుతుంది. ఆ పరమశాంతిని పొందటానికి నాకు నేనే అడ్డువస్తున్నాను కాని ఇతరులు ఎవరూనాకు అడ్డురావటంలేదు. మనంచేసేపనిలో, మాట్లాడే మాటలో అహంభావన కలుగజేసుకొంటూ ఉంటుంది. మనకు పనికిరాని వస్తువులను తీసి ఎలాప్రక్కన పెడతామో అలాగ మనపనిలో, మాటలలో అహంభావన కలుగచేసుకోకుండా చూసుకోవాలి. దానిని ఒక ప్రక్కన పెట్టాలి. ఆహరం తీసుకోకుండా ఉండటం, నామాన్ని జపించటం తపస్సుకాదు. అహంవృత్తిని తగ్గించుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే తపస్సు. ఈ శరీరం శవం అవ్వకముందే అహంవృత్తి యొక్క మూలాన్ని ఎవడైతే తెలుసుకొన్నాడో వాడు జీవన్ముక్తుడు అవుతాడు.

నీకు ఎంతధనంఉన్నా, చదువుఉన్నా, మంచిసంతానంఉన్నా నీకు మోక్షంరాదు. ఇవి భౌతికవిషయాలు. మరి మోక్షం ఎలావస్తుంది ? నీ శరీరం మరణించినా మరణంలేని వస్తువు ఒకటి నీహృదయంలో ఉంది. నీ హృదయంలో ఉన్న మరణంలేని వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొంటే నీవు అజ్ఞానమునుండి విడుదల పొందుతావు. నీకు మోక్షం కలుగుతుంది. కొంతమందికి

సహజంగా బాహ్యదృష్టిఉంటుంది. వారుగుడులలో దేవుడు అంటే ఇష్టపడతారు. కొంతమందికి సహజంగా అంతర్దృష్టి ఉంటుంది. వారు హృదయంలోదేవుడు అంటే ఇష్టపడతారు. సత్పురుషులు సహవాసం చేస్తే మనస్సు అంతర్ముఖం అవుతుంది. గురువుచెప్పి మాటలను శ్రవణంచేయటంవలన, శాస్త్రాన్ని శ్రవణం చేయటంవలన బాహ్యాముఖంగా ఉన్న మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణంచేస్తుంది.

మన మనస్సును నియమించుకొంటేగాని ఈ లోకంలోగాని, పరలోకంలోగాని సుఖపడలేం. మనస్సుబాహ్యంగా విజృంభిస్తూ ఉంటే బంధం. మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణించి హృదయంలో అణిగిపోతే మోక్షం. జ్ఞానికి మనస్సు ఉంటుంది, అజ్ఞానికి మనస్సు ఉంటుంది. జ్ఞానిమొక్క మనస్సు ఈశ్వరుని స్వాధీనంలో ఉంటుంది, అజ్ఞాని యొక్క మనస్సు అహంకారం స్వాధీనంలో ఉంటుంది.

రాగము, భయము, కోపము ఈ మూడింటిని విడిచిపెట్టమని భగవంతుడు చెప్పాడు. ఎందుకు విడిచిపెట్టమని చెప్పాడు అంటే రాగం వలన,భయం వలన, కోపం వలన నీకు దుఃఖం వస్తుంది. ఏకారణం వలన నీకు దుఃఖం కలుగుతుందో ఆకారణాలను విడిచిపెట్టమని భగవంతుడు చెప్పాడు. నీవుకోరికకు దూరంగా ఉండు. కోరిక లేకపోతే పని జరగదు అనిఅనుకోవద్దు. కోరికకు శక్తిలేదు. శక్తి ఈశ్వరుడిది. నీకోరికతో నిమిత్తంలేకుండా దేహప్రారబ్దంలో ఏది ఉంటే అది జరుగుతుంది. ద్వైతబుద్ధిలో నుండి రాగం, భయం, కోపంవస్తుంది. ప్రతీచిన్న విషయానికి కోపం తెచ్చుకోనే వాడికి హృదయం మొక్క లోతులు పెరగవు. ఆలోచనశక్తి ఉండదు. భౌతికంగా కూడా నష్టపోతాడు. నీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెప్పాడు. కర్మఫలాన్ని ఆశించకుండా పనిచేస్తే అది యజ్ఞం. మీకు ఉన్న భౌతికశక్తులను స్వార్థంకోసం కాకుండా, సమాజంకోసం ఉపయోగించు. నీవు చేసేదానం వలన నీకుచల్లదనం కలగాలి, తీసుకొనేవాడికి చల్లదనంకలగాలి. అంతేగాని గొప్పలకోసం, లోకానికి సంబంధించిన పేరుకోసం దానంచేస్తే పేరువస్తుంది గాని ఈశ్వరానుగ్రహానికి పాత్రుడువు కాలేవు. ఎవరికైనా ఏదైనా ఇచ్చినా అది పూజఅనుకొని చేయాలి. అప్పడు నీవు బాగుపడతావు. నీచైతన్యస్థాయి పెరుగుతుంది. తపస్సు అంటే తపింపజేయటం నీమనస్సును, ఇంద్రియాలను తపింపజేయటం. అహంకారం నుండి విడుదల అవ్వటానికి నీవు చేసే ప్రతీపని తపస్సుతో సమానము. కర్తృత్వం లేకుండా పనిచేస్తే వాడుచేసినా చెయ్యనివాడితొ సమానము. ఆపని నిన్ను చుట్టుకోదు.

చూడటానికి కళ్ళు ఎలాఇచ్చాడో, నడవటానికి కాళ్ళు ఎలాఇచ్చాడో, పనిచేయటానికి చేతులు ఎలా ఇచ్చాడో అలాగే ఆలోచించుకోవటానికి నీకు బుద్ధిని భగవంతుడు ఇచ్చాడు. బుద్ధిని సోమరితనంగా ఉంచకూడదు. ఏమాట మాట్లాడాలి, ఏదిమాట్లాడకూడదు. ఏపనిచేయాలి ఏది చేయకూడదు. ఎప్పడు ఎక్కడ ఎలా ప్రవర్తించాలి అని మనబుద్ధికి ఆలోచన కలుగజేయాలి. శరీరం అనేకారుకు బుద్ధి డ్రైవర్. డ్రైవర్‌ను జాగ్రత్తగా చూసుకోవాలి. దానిని ఆలోచింపజేయాలి, సత్పురుషులతొ సహవాసం చేస్తూఉంటే నీబుద్ధి బాగుపడుతుంది. నీవు పూర్వజన్మలలో పుణ్యకర్మ చేయటంవలన మానవజన్మ వచ్చింది. ఈ మానవజన్మను సద్వినియోగం చేసుకోవాలి. కొంతమందికి అన్నీకావాలి, మోక్షంకూడా కావాలి అనుకొంటారు. అలాఉంటే మోక్షంరాదు. నాకు

మోక్షం ఒక్కటే కావాలి అనే దీక్ష ఉన్నవారికి మోక్షం వస్తుంది. మోక్షం కోరుకొనేవాడు పనిచేయడు అని అనుకోవద్దు. వాడూపనిచేస్తాడు. వాడు ఏపనిచేసినా, ఏమాట మాట్లాడినా, వాడు సమాజంలో జీవించినా, ఏకాంతవాసంలో ఉన్నావాడి లక్ష్యం మోక్షం మీద ఉంటుంది. వాడు ఏపనిచేసినా ఆపనిచేయటం వలన మనం మోక్షం పొందటానికి ఆపని సహకరిస్తుందా, లేదా అని చూసుకొని పనిచేస్తాడు.

మీరు సమాజమును విడిచిపెట్టి పారిపోనక్కరలేదు. మీరు సమాజములో ఉన్నా మీ ప్రవృత్తిని బట్టి మీరు ఏపనిచేస్తున్నా మీ లక్ష్యం మోక్షంమీద పెట్టుకోవాలి.

నీహృదయంలో పరమేశ్వరుడు ఉన్నప్పటికీ నీదురలవాట్ల కారణంగానే ఆయన నీకు తెలియటంలేదు. నీకు తెలియనంత మాత్రంచేత ఆయనలేడు అని అనుకోవద్దు. నీజీవితవిధానం మార్చుకొంటే, నీస్వార్ధాన్ని ప్రక్కనపెడితే, దేహబుద్ధిని విడిచిపెడితే లోపలున్న పరమేశ్వరుడు నీకు తెలుస్తాడు. పూర్వజన్మలో మనం చేసినపనులు, మనకోరికలు అన్ని మన మనస్సులో ఉన్నాయి. మన మనస్సే మనకు శిక్ష, రాబోయే జన్మకు కారణములు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు అణిగిపోతే నువ్వు లేవు, నేను లేను. ఉన్నది ఒక్కటే వస్తువు. నీవు, నేను అనే భేదబుద్ధి, పుణ్యపాపములు, మంచిచెడులు అన్నీ మనస్సులోనే ఉన్నాయి, మనస్సు అణిగిపోతే మనస్సులో ఉన్న వికారములు అన్నీ అణిగిపోతాయి. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే వైకుంఠము నిజమే, కైలాసము నిజమే, దేవుళ్ళు నిజమే, నీవు అనుభవించే భోగాలు నిజమే, నీ మనస్సు ఎంతనిజమో ఇవి అన్ని కూడా అంతే నిజము. ఇక్కడ పుణ్యం చేసుకొని స్వర్గానికి వెళ్ళి భోగాలు అనుభవించవచ్చు అనుకొంటున్నారు. మీరు అనుభవించే భోగాలు అన్నీ మరల వాసనల క్రింద వచ్చేస్తాయి. ఇప్పుడు భోగం అనుభవిస్తే మనం అనుభవించే భోగాలే పరిణామంలో రోగాలుగా వస్తాయి, దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. మీరు enjoy చేయవచ్చు కాదని చెప్పటంలేదు. కాని Enjoyment మనగమ్యం కాదు, Peerfection మన గమ్యం. ఇది బాగా అర్ధంచేసుకోవాలి.

గాఢనిద్రలో మీరు సుఖంగా ఉన్నారు. గాఢనిద్రలో మీ డబ్బు జ్ఞాపకం రావటంవలన సుఖంగా ఉన్నారా? కాఫీ త్రాగటం వలన సుఖంగా ఉన్నారా ? సినిమాలు చూడటంవలన సుఖంగా ఉన్నారా? భోగాలు అనుభవించటం వలన సుఖంగా ఉన్నారా? దేనివలన సుఖంగా ఉన్నారు. భౌతిక ప్రపంచంతో సంబంధం లేకుండా, విషయాలతో సంబంధం లేకుండా, దేవుడితో సంబంధంలేకుండా గాఢనిద్రలో మీరు సుఖంగా ఉన్నారు. నామరూపములతో సంబంధం లేకుండా, ఇంద్రియాలతో సంబంధం లేకుండా గాఢ నిద్రలో స్వంతంత్రంగా మీరు సుఖాన్ని అనుభవిస్తున్నారు. నమ్మకాలతో పనిలేదు. ఇది మీ అనుభవం. గాఢనిద్రలో మీరు సుఖంగా, శాంతిగా ఉన్నారుగాని అక్కడ ఎరుకలేదు. జాగ్రదావస్థలో ఎరుక ఉందిగాని సుఖంలేదు. అక్కడ ఉన్నది ఇక్కడలేదు. ఇక్కడ ఉన్నది అక్కడలేదు. గాఢనిద్రలో ఉన్న సుఖం, జాగ్రదావస్థలో ఉన్న ఎరుక ఒకేసారి ఎవడైతే అనుభవిస్తున్నాడో వాడు మోక్షాన్ని పొందుతాడు. వాడు మహాజ్ఞాని, మహాగురువు. ఆ పరమసుఖాన్ని ఎవడైతే పొందాడో వాడికి దేహం ఉన్నా ఒక్కటే, దేహం లేకపోయినా ఒక్కటే. దేహం ఉండటంవలన వాడికి లాభం లేదు, దేహం లేకపోవటం వలన వాడికి నష్టంలేదు. మోక్షానికి దేహం చనిపోవటానికి ఎట్టి సంబంధం లేదు.